
# ఇ - పిల్లి




ఎం. వీరేశ్వరరావు

అసలు పిల్లి నా జీవితంలో సమస్య అవుతుందని ఎప్పుడూ అనుకోలేదు. ఎలకల సమస్య పరిష్కరించాలని పిల్లికి ఉద్యోగం ఇచ్చాను. దానిపని రోజుకి రెండు ఎలకల్ని పట్టాలి, ప్రతిఫలంగా దానికి రోజూ గ్లాసుడు పాలు, వారానికొకసారి మాంసం అని! సరే పిల్లి గారు ఎంపాయింట్‌మెంట్ లెటర్ మీద చిన్న పంజాముద్ర వేసి ఉద్యోగంలో జాయిన్ అయ్యారు.

పిల్లిగారు ఎలకల్ని పడుతున్నట్లు లేదు. గొడవ మామూలే! కూరలు కొరకడం, బట్టల్ని కొరకడం వగైరా. పిల్లి వచ్చాక కూడా ఎలుకలు తగ్గ లేదు అంటే ఎలకల్ని వేటాడటం లేదా? పిల్లి ఏంచేస్తున్నట్లు అని సందేహం వచ్చింది. సరే దానితో మాట్లాడాలని నా గదిలోకి వెడితే పిల్లి గారు నాకంప్యూటర్ని ఆపరేట్ చేస్తోంది. ఆశ్చర్యపోయాను. పిల్లి తోకతో ఎంటర్ బటన్ నొక్కుతోంది.

"ఎలకల్ని పట్టడం మానేసి కంప్యూటర్‌తో ఏంచేస్తున్నావు?" అడిగాను వెటకారంగా!

'ఇ-మెయిల్ ఇస్తున్నా డిస్టర్బ్ చెయ్యకు"అంది పిల్లి నాకేసి తిరగకుండా.

"నీ పని ఎలకల్ని పట్టడం. కంప్యూటర్‌తో కాలక్షేపం కాదు" అన్నాను కోపంగా.

"అవుననుకో! అబ్బా పుట్టినప్పటి నుండి ఎలకల గురించి పరుగులు తీసి తీసి విసిగిపోయాను. కొంచెం రిలాక్స్ అవుతున్నా. నీ కంప్యూటర్ లో 'సోలిటైర్' గేమ్ ఒక్కటే వుంది. గేమ్స్ లోడ్ చేపించు" అంది పిల్లి.

"రిలాక్స్ అవ్వడానికి కాదు నీకు ఉద్యోగం ఇచ్చింది"

"తెలుసులే! ఎలకల్ని ఇవ్వాళ కాకపోతే రేపు పట్టుకోవచ్చు" అంది బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ! "అవును అప్పటికి బట్టలన్నీ ఎలకలు కొరికి ఒంటిమీద బట్టలు కూడా మిగలకపోవచ్చు!"

"మీసాలు మెరిసేలా, చిన్న కోరలు కనబడేలా పిల్లిగారు నవ్వారు పులిలా బిల్డప్ ఇద్దామని.

"ఎలకల్ని పట్టకుండా కంప్యూటర్‌లో ఏం చేస్తున్నావు?" అడిగాను.

"ఇప్పుడే www.cat.com చూసాను. విదేశాలలో ఉన్న తోటి సోదర పిల్లులకు e-mail ఇస్తున్నాను. చిన్నచిన్న కవితలు రాస్తున్నాను. నర్సరీ రైమ్ కాన్వెంట్‌లో చెప్తారు.

"నేను చిన్నప్పుడు కాన్వెంట్ కాదులే!"

"అందుకే బ్రెయిన్ ఎదగడలేదు. పుస్సీ క్యాట్ పోయమ్ రాస్తున్నా! కెనడాలో ఉన్న నా స్నేహితులకి ఇవ్వాలి" అంది పిల్లిగారు తెల్లని మీసాలు తిప్పుతూ.

"ఎలకల్ని పట్టవా!"

"పాపం ఎలుకలు మాత్రం జీవులు కావా? వాటికి మాత్రం భూమి మీద జీవించే హక్కు లేదా? ఆ పరమాత్మ వాటికి అవకాశం ఇవ్వలేదా?" అంటూ తత్వాలు ఒలకబోసింది.

పిల్లిగారు జపమాల తిప్పుతున్నారు.

"ఎలకల్ని చంపితే ఫైన్ వేస్తామని జీవకారుణ్య సంఘంవాళ్ళు నిన్న చెప్పారు" అంది పిల్లి.

నాకు జరిగిన నష్టానికి పరిహారం నువ్వు ఇస్తావా? వాళ్ళు ఇస్తారా? ఈ జీవకారుణ్య సంఘం వాళ్ళు ఒకళ్ళు! వీళ్ళకి మనుష్యులు తప్ప మిగిలిన జీవాలు కనిపిస్తాయి. నల్లులమీద, దోమలమీద కుక్కలమీద ప్రేమ. మొన్నటికి మొన్న కుక్కల బండికి అడ్డంగా పోయి కుక్కల్ని వదిలెయ్యమన్నారు. ఆ మర్నాడే మా ఫ్రెండ్ రాంబాబుని కుక్క కండ బయటికి వచ్చేలా కొరికింది. మందులకి వెయ్యిదాకా వదిలింది. అప్పుడు ఈ దిక్కుమాలిన సంఘం ఏం చేసింది?" అన్నాను నేను కోపంగా. "పిల్లి" మ్యావ్ అన్నారు.

"ఎలకల్ని పట్టకపోతే కర్రపెట్టె కొట్టి గెంటేస్తాను"

"అదే వద్దు. నువ్వు నన్ను కొట్టావనుకో! మీ తోటమాలి మీద పడి గుడ్లు పీకేస్తాను. తర్వాత పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి నువ్వే తోటమాలి పని నచ్చలేదని శాడిస్టులా గుడ్లు పీకేశావని చెప్తాను. దెబ్బతో జైలులో కూర్చుంటావు" అంది పిల్లిగారు.

దాని క్రిమినల్ బ్రెయిన్‌కి ఆశ్చర్యపోయాను.

పిల్లిగార్ని ఎలా ఒదుల్చుకోవాలో అర్థం కాలేదు. రోజురోజుకి దాని ఆగడాలు పెరిగిపోతున్నాయి. ఎలకలతో కలిసి రాత్రి బృందగానం చెయ్యడం, ఇంటర్నెట్‌లో పోర్నోసైట్‌లు చూడటం ఎక్కువ అయ్యింది. పాలు ఇవ్వడం మానేశాను. ఫ్రిజ్ తలుపు తీసి కేక్‌లు తినడం ఎక్కువ అయ్యింది. పిల్లిని ఒదుల్చుకోవడానికి మంచి కుక్కని తీసుకువచ్చాను.

కుక్కని తీసుకువచ్చిన రెండు రోజులు పిల్లి కనబడలేదు.

వెళ్ళిపోయినందనుకున్నాను కుక్కకి భయపడి.

ఒకరోజు కుక్కతో పిల్లి మాట్లాడుతోంది. 'పొత్తు'ని కుదుర్చుకొనే రాజకీయానాయకుడిలా! "తనని చంపకుండా ఉంటే ఇంటర్నెట్ నేర్పుతానని, కుక్కలా కాపలా కాస్తున్నప్పుడు ఫ్రిజ్‌లో నుండి కేక్‌లు, డ్రింక్‌లు తెస్తానని ప్రామిస్ చేసింది 'పిల్లి'!

"నేను నా యజమానికి ద్రోహం చెయ్యను" అంది కుక్క.

ఎంతైనా కుక్క కుక్కే, పిల్లిలా కాదు.

"అదిగో అదే నాకు చిరాకు వస్తుంది. ఇప్పుడు నువ్వు నేను చెప్పినదానికి ఒప్పుకోలేదనుకో!నువ్వు లైసెన్స్‌లేని కుక్కవని, వీధిలో చాలామందిని కరిచావని, నిన్నిలా వదిలేస్తే ఈఊళ్ళో వాళ్ళందరూ రాబిస్‌తో పోతారని చెప్తాను కొత్తగా వచ్చిన మునిసిపల్ కమీషనర్‌తో. మర్నాడే కుక్కల బండి వస్తుంది. దాంతో నీచాప్టర్ క్లోజ్"అని కుక్కని బెదరగొట్టింది పిల్లి.

"ఒరినాయనో ఈ పిల్లి గుండెలు తీసిన బంటులా ఉంది. అప్పటినుండి కుక్క భయపడి పిల్లికి తోక ఊపడం ప్రారంభించింది. ఉన్న గొడవలు చాలనట్లు పిల్లిగారు గండుపిల్లిని ప్రేమించింది. అవి రెండూ రాత్రిళ్ళు మార్జాల సరసమాడుకుంటుంటే పెద్ద గొడవలతో ఇల్లు అదిరిపోయేది.

ఇ-పిల్లి ఇలాగే ఉంటే నన్ను కూడా ఎవరికో అమ్మేస్తుందని అనిపించింది. ఇప్పటికే దానికి 'ఇంటర్నెట్ పిల్లి' అని పేరు వచ్చింది. మిగతా పిల్లులు దాని దగ్గరికి సలహాలకి వస్తున్నాయి.

దాని రోగం కుదర్చాలని కంప్యూటర్ లేకుండా చేసాను. ఫ్రిజ్ తాళం వేసాను. తినడానికి ఏం లేకుండా చేసాను. కొత్తగా వచ్చిన ఇబ్బందులకు పిల్లి కాలుకాలిన పిల్లిలా తిరిగింది. పాపం సుఖాలకు అలవాటుపడి ఎలకల్ని పట్టడం మర్చిపోయింది. రెండు రోజులు ఆకలికి నకనకలాడింది.

మర్నాడు వచ్చి జాబ్‌కి రిజైన్ చేస్తున్నానంది.

"మంచిది" అన్నాను నేను. "ఎక్కడికి పోతున్నావు" అడిగాను.

జేబులో నుండి పాస్‌పోర్ట్, వీసా తీసి నా ముఖాన పడేసింది.

"నీకీ టాలెంట్ కూడా ఉందా. ఏ దేశం పోతున్నావు?" అడిగాను.

"దుబాయ్"

"దుబాయ్‌లో ఏం చేస్తావు? దేశభక్తి లేదా?" అడిగాను.

"పిల్లికి స్వామిభక్తే ఉండదు. ఇక దేశభక్తి ఎక్కడ ఉంటుంది?"

నిజమేననిపించింది.

"ఇంటర్నెట్ పిల్లి అని నాకు స్పెషల్ పోస్ట్ ఇచ్చారు. అక్కడి పిల్లులకు ఇంటర్నెట్ నేర్పాలట" తెల్లమీసాలు గర్వంగా తిప్పుతూ! పిల్లి వెళ్ళిపోయింది. కుక్క విశ్వాసంగా ఉంది. పిల్లిమాట విన్నందుకు క్షమించమంది. ఎంతైనా కుక్క కుక్కే! రెండు రోజుల తరువాత తెలిసింది పిల్లిగారు ఎక్కిన విమానం పూర్తిగా గాలిలోకి లేవకుండానే మంటలు లేచాయని దుబాయ్ వెళ్ళవలసిన పిల్లి దుర్మరణం చెందిందని! 'హమ్మయ్య' అని గాలి పీల్చుకున్నా!